E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 03-09-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




ఐదు రోజులూ వర్షా లే... 3లో



# కవిత సస్పెన్షన్.. కేసీఆర్ నిర్ణయం

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం
- ప్రకటన విడుదల చేసిన పార్టీ నేతలు
- హరీశ్, సంతోష్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కేసీఆర్
- ఆమె తీరు పార్టీకి నష్టం కలిగించేలా ఉందనే అభిప్రాయం



తరువాయి 2లో

## మరణించిన నా తల్లిని దూషిస్తారా

- బీసీ గద్దెనెక్కడం కాంగ్రెస్ సహించదు
- ఆర్జేడీ హయాంలో బిహార్లో నేరాల వెల్లువ
- అందుకే మహిళలే దించేశారు: మోదీ



తరువాయి 2లో


## లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

» 4లో



## అలా ఎందుకు చేస్తారని బాధప డుతుంటాను

» 5లో



# ప్రాణహిత కట్టి తీరుతాం



- తుమ్మిడిహట్టి బ్యారేజీ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను నిర్మిస్తాం
- రైతాంగానికి సాగు నీరు.. ప్రజలకు తాగు నీరు అందిస్తాం
- వైఎస్ స్ఫూర్తితోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం
- సమకాలీన రాజకీయాల్లో.. అధికారం ఉన్నప్పుడే మిత్రులు
- అధికారం పోయాక మాయమవుతారు.. కేవీపీ అలా కాదు
- వైఎస్‌కు పదవులు లేని సమయంలోనూ తోడుగా ఉన్నారు
- కేవీపీలా ఉంటామంటూ నా దగ్గరకూ కొందరు వస్తున్నారు
- మొదటివారం రమ్మంటే.. రెండోవారం 'అంతా నాదే' అంటున్నారు.. వైఎస్ స్మారక పురస్కార సభలో సీఎం రేవంత్

ఈకబురు, హైదరాబాద్ : వైఎస్ రాజశేఖర్‌రెడ్డిహయాం లో చేపట్టిన ప్రాణహితచేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రూ. 11వేల కోట్లకు పైగా ఖర్చుతో చేపట్టిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహటి బ్యారేజీని పూర్తి చేసి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌కు గోదావరి నీటిని అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సుమారు 3.6 లక్షల ఎకరాలకు సాగునీరు, ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ జిల్లాలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రతిపాదించిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం దసపల్లా హోటల్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రేవంత్.. సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.సుధ, డాక్టర్ సి.నాగేశ్వరరావుకు డాక్టర్ వైఎస్.రాజశేఖర రెడ్డి మెమోరియల్ అవార్డు 2025ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎంగా వైఎస్ తొలి సంతకం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైల్ పైనే చేశారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు రూపకల్పన చేశారన్నారు. వైఎస్ ఆలోచలనకు అనుగుణంగా పని చేస్తున్న తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.

తరువాయి 2లో

తరువాయి 2లో

## సీబీఐకి ద్వారం తెరిచిన సర్కారు

### 2022 నాటి ఉత్తర్వులకు సవరణ

కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా విచారణ

జరపాలని కేంద్రానికి లేఖ



ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో సీబీఐ విచారణలు చేపట్టకుండా.. 2022 ఆగస్టులో జారీ చేసిన జీఓను సవరిస్తూ ప్రభుత్వం తాజాగా జీఓను జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన నేపథ్యంలో.. అందుకు అనుగుణంగా తాజా జీవోను వెలువరించింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నాణ్యత లోపాలు కారణమని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన తుది నివేదికలోని అంశాల ఆధారంగా సీబీఐ విచారణ జరపనుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కూడా జీఓలో ప్రభుత్వం పేర్కొంది. అయితే హైకోర్టులో మంగళవారం జరిగిన విచారణలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సులపై చర్యలు తీసుకోవడం లేదని, ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో సీబీఐ ప్రవేశానికి వీలు కల్పిస్తూ.. సోమవారం ఇచ్చిన జీఓలో కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలపై విచారణ అని పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకొంది. న్యాయ విచారణ కమిషన్ నివేదికపై కోర్టులో కేసు ఉన్నందున... ఎన్‌డీఎస్ఏ నివేదికలోని అంశాలపై విచారణ చేపట్టాలని కేంద్రానికి రాసిన లేఖలో ప్రభుత్వం పేర్కొన్నట్లు స్పష్టమవుతోంది.

తరువాయి 2లో

## ఎన్నికల వాయిదాకే మొగ్గు?



- స్థానిక ఎన్నికలు రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచన
- అందుకోసం హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం!
- రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం రాకపోవటమే ప్రధాన కారణం

ఈకబురు, హైదరాబాద్:స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం ఎటూ తేలకపోవడంతో.. వాటిని మరో రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అందుకోసం హైకోర్టును ఆశ్రయించాలనే ఆలోచనతోప్రభుత్వం ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 30వ తేదీలోగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలను అమలుచేయటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రిజర్వేషన్లు తేలకపోవటంతో..

తరువాయి 2 లో

## షికాగో.. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన నగరం: డొనాల్డ్ ట్రంప్

» 3లో



## ఆర్థిక సవాళ్లున్నా తగ్గేదేలే!

» 3లో



## నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం

- అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు...
- భారత్ ఎప్పుడూ డెడ్‌లైన్స్ పెట్టుకుని చర్చలు జరపదు: పీయూష్ గోయల్



తరువాయి 2లో

## లండన్‌లో ఇద్దరు తెలంగాణ విద్యార్థుల మృతి



- గణేశ్ నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- నాదర్‌గుల్‌కు చెందిన చైతన్య, ఫీర్జాదిగూడకు చెందిన రిషితేజ దుర్మరణం
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# కవిత సస్పెన్షన్.. కేసీఆర్ నిర్ణయం



ఈకబురు, హైదరాబాద్: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బీఆర్ఎస్ సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు.. బీఆర్ఎస్ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నష్టం కలిగించే రీతిలో ఉన్నాయని బీఆర్ఎస్ అధిష్ఠానం భావించింది. కవిత వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేసీఆర్..ఆమెను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**కవిత వ్యాఖ్యలపై కేసీఆర్ సీరియస్!**

మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌లక్ష్యంగా కవిత చేసిన వ్యాఖ్యలను పార్టీ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ, సీబీఐకి అప్పగించాలనే నిర్ణయం నేపథ్యంలో కవిత చేసిన ఆరోపణలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయనే అభిప్రాయం ఆయన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి వరకు ఎర్రవల్లి నివాసంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మరికొందరు సీనియర్ నేతలతో సుదీర్ఘంగా చర్చించిన కేసీఆర్.. పార్టీ ప్రయోజనాలు, కేడర్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కవితపై సస్పెన్షన్ వేటుకు ఆదేశించినట్లు సమాచారం. ఇకపై కవిత చేసే ఆరోపణలు, విమర్శలకు స్పందించాల్సిన అవసరం లేదనే అభిప్రాయం కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీని ఏకతాటిపై నడిపించడంపై దృష్టి కేంద్రీకరించాలని కేటీఆర్‌ను ఆదేశించినట్లు సమాచారం.

**కేసీఆర్ ప్రజల సొత్తు అంటున్న నేతలు**

కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందిన అన్ని స్థాయిల నేతలు స్వాగతించారు. కేసీఆర్ ఎవరి సొత్తూ కాదని, కవితతో పాటు పార్టీ కేడర్‌కు ఆయన తండ్రి లాంటి వాడని పార్టీ వర్గాలు వ్యాఖ్యానించాయి. పార్టీ కోసం కన్నబిడ్డను కూడా వదులుకున్న నేత కేసీఆర్ అంటూ పలువురు నాయకులు కొనియాడారు.

కేసీఆర్ ప్రతిష్టపైనే బీఆర్ఎస్ మనుగడ, 60 లక్షల మంది కేడర్ భవిష్యత్తు ఆధారపడి ఉందనే విషయాన్ని కవిత మరిచిపోయి విమర్శలు చేశారంటూ పలువురు నేతలు ప్రకటనలు విడుదల చేశారు. కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చేలా ఆమెను ఎవరో మానసిక ఒత్తిడికి గురిచేసి ఉంటారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఒకరు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కవిత చేసిన ఆరోపణలు కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న విమర్శలకు ఊతమిచ్చేలా ఉన్నాయనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. కేసీఆర్‌కు, పార్టీకి బాధ కలిగించే అంశమైనప్పటికీ సస్పెన్షన్ తప్పనిసరి అని పార్టీ అధినేత భావించారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

మొదటి పేజీ తరువాయి

# మరణించిన నా తల్లిని దూషిస్తారా



ఈకబురు, న్యూఢిల్లీ/పట్నా, : ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ బిహార్లో చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'లో కాంగ్రెస్, ఆర్‌జేడీ నేతలు తన తల్లిని, తనను దూషించడంపై ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. నూరేళ్లు బతికి మరణించిన తన తల్లికి రాజకీయాలు తెలియదని.. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. తన తల్లినే గాక దేశంలోని అందరు అమ్మలు, అక్కచెల్లెమ్మలు, ఆడబిడ్డలను అవమానించడమేనని స్పష్టంచేశారు. స్వయం సహాయక బృందాల(ఎస్‌జీహెచ్ గ్రూపులు)కు ఆర్థిక సాయం చేయడానికి సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'జీవికా నిధి సాఖ్ సహకారీ సంఘ్ లిమిటెడ్' సంస్థను మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'అమ్మ ప్రతి ఒక్కరి ఆత్మగౌరవం. కొద్ది రోజుల కిందట దర్భంగాలో జరిగిన కాంగ్రెస్‌ఆర్‌జేడీ సభ వేదికపై నా తల్లిని దూషించారు. సంప్రదాయ విలువలకు పేరుగాంచిన బిహార్ నేలపై ఇలాంటి ఘటన జరుగుతుందని నేనెన్నడూ ఊహించలేదు. బిహార్లో ఇది చూసిన ప్రతి తల్లీ ఇందుకు ఎంతగానో బాధపడుతోందని నాకు తెలుసు. నా గుండెల్లో ఉన్నంత బాధే వారిలో కూడా ఉంది. భారత మాతనే అవమానించేవారికి.. నా తల్లి పట్ల అలాంటి అసభ్య పదాలు వాడడం పెద్ద లెక్కలోది కాదు. ఇలాంటివారిని శిక్షించాలి. నా తల్లికి రాజకీయాలతో సంబంధం లేదు. ఆమె తప్పేంటి..? ఎందుకు దూషించాలి? బిహార్ సీతామాత జన్మభూమి. కాంగ్రెస్, ఆర్‌జేడీలను నేను క్షమించినా.. బిహార్ తల్లులు క్షమించరు' అని మోదీ అన్నారు. తనకు జన్మనిచ్చిన తల్లి మాతృభూమికి సేవచేయాలని తనను కోరిందని.. అందుకే దేశంలో మహిళల సంక్షేమానికి తాను అవిశ్రాంతంగా కృషిచేస్తున్నానని తెలిపారు. ఆమె తన కోసం చీర కూడా కొనుక్కుని ఎరుగదని చెప్పారు. మహిళా వ్యతిరేక మనస్తత్వం ఉన్నవారు అధికారంలోకి వస్తే.. అమ్మలు, అక్కచెల్లెళ్లు, ఆడబిడ్డలు ఎక్కువ బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆర్‌జేడీ హయాంలో రాష్ట్రంలో నేరాలు, హత్యలు, దోపిడీలు, అత్యాచారాలు, వసూళ్లు నిత్యకృత్యమని గుర్తుచేశారు. హంతకులు, రేపిస్టులకు ఆర్‌జేడీ ప్రభుత్వం రక్షణ కల్పించిందన్నారు. నాడు మహిళలే ఎక్కువగా బాధలు పడ్డారని.. వారే ఆ ప్రభుత్వాన్ని దించేశారని చెప్పారు. వెనుకబడిన వర్గాలకు చెందిన వారు అధికారంలోకి రావడాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ సహించదని.. అందుకే తనను దూషిస్తోందని మోదీ ధ్వజమెత్తారు.

**తక్కువ వడ్డీతో రుణాలు..**

స్వయం సహాయక బృందాలకు తక్కువ వడ్డీతో రుణాలు/ఆర్థిక సాయం అందించడం నితీశ్ సర్కారు ప్రారంభించిన 'జీవికా నిధి' లక్ష్యం. ఈ సంస్థ నిర్వహణకు రాష్ట్రప్రభుత్వం, కేంద్రం కూడా నిధులు అందిస్తాయి. మహిళా పారిశ్రామికవేత్తలు ఆర్థిక సాయం కోసం ప్రస్తుతం సూక్ష్మ ఆర్థిక సంస్థలపై ఆధారపడుతున్నారు. 1824 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మహిళలకు తక్కువ వడ్డీలతో సకాలంలో ఆర్థిక సాయం అందించే జీవికా నిధిని ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ పూర్తిగా డిజిటల్ లావాదేవీలే నడుస్తాయి. దీని ద్వారా 'జీవికా దీదీల' బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ అవుతాయి.

కాంగ్రెస్ నేత ఖేడాకు రెండు ఓటరు ఐడీలు కాంగ్రెస్ మీడియా విభాగం ఇన్‌చార్జి పవన్ ఖేడాకు వేర్వేరు నంబర్లతో రెండు ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ గగ్గోలు పెడుతున్నారని, కానీ అసలు 'ఓట్ల దొంగ' కాంగ్రెస్సేనని విమర్శించింది. ఖేడాకు రెండు ఓటరు ఐడీలు ఎలా వచ్చాయో ఎన్నికల సంఘం(ఈసీ) దర్యాప్తు చేయాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఎన్నికల సంఘం ఖేడాకు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ 11 గంటల్లోపు సమాధానం ఇవ్వాలని సూచించింది. బీజేపీ ఆరోపణలపై ఖేడా స్పందిస్తూ ఆ పార్టీ నాయకులు చెప్పిన తర్వాతే తనకు రెండో ఓటరు ఐడీ ఉన్నట్లు తెలిసిందన్నారు. దీన్ని బట్టి ఓటర్ల జాబితాలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో తేటతెల్లమవుతోందన్నారు. దీనికి ఈసీనే నిందించాలని, ఓటర్ల జాబితాలను సక్రమంగా నిర్వహించడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు.

మొదటి పేజీ తరువాయి

# నవంబరు కల్లా అమెరికాతో వాణిజ్య ఒప్పందం



**ఈ-కబురు, న్యూఢిల్లీ, : అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయని.. త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని.. నవంబరుకల్లా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నామని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ముంబైలో జరుగుతున్న అంతర్జాతీయ పెట్టుబడిదారుల వార్షిక సదస్సును ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన గోయల్.. భారత్‌తో వాణిజ్య, వ్యాపార సంబంధాలను పెంచుకోవాలనే ఆసక్తి, ఉత్సాహం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతోందని అన్నారు. ఈయూతో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు కూడా చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే.. అంతకుముందు మరో కార్యక్రమంలో మాట్లాడుతూ అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, భారతదేశం ఎప్పడూ డెడ్‌లైన్స్ పెట్టుకొని వాణిజ్య చర్చలు జరపదని.. పరస్పర ప్రయోజనకరంగా ఉండే ఒప్పందాలపై మాత్రమే చర్చలు జరుపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇండియా సరఫరా వ్యవస్థలు చాలా బలంగా ఉన్నాయని.. వేరే ఏ ఇతర దేశ దయాదాక్షిణ్యాలపైనా మనం ఆధారపడి లేమని ఆయన తేల్చిచెప్పారు. చిలీ, పెరు, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఓమన్ వంటి దేశాలతో కూడా కొత్త వాణిజ్య ఒప్పందాలను భారత్ కుదుర్చుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా, సుంకాలు, ఇంధన విధానాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. రెండు గొప్ప దేశాలైన ఇండియా, అమెరికా బంధానికి బలమైన పునాదులు ఉన్నాయని.. ఈ సమస్యను ఇరు దేశాలూ పరిష్కరించుకుంటాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ విలువలు.. రష్యా, చైనా కన్నా అమెరికా విలువలకు దగ్గరగా ఉంటాయని 'ఫాక్స్ న్యూస్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు.**

మొదటి పేజీ తరువాయి

# ప్రాణహిత కట్టి తీరుతాం

ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. సీఎంగా వైఎస్ తొలి సంతకం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫైల్ పైనే చేశారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు రూపకల్పన చేశారన్నారు. వైఎస్ ఆలోచలనకు అనుగుణంగా పని చేస్తున్న తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి 2009లో రెండోసారి సీఎంగా ఎన్నికైన వెంటనే గాంధీభవన్‌కు వెళ్లి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారన్ది గుర్తు చేశారు. అందరి సహకారంతో రాహుల్‌ను ప్రధానిగా చేసే లక్ష్యంతో తాము పని చేస్తున్నట్టు తెలిపారు. సుభాష్ పాలేకర్ సూచించినట్టుగా.. ఎరువుల కొరతకు ఆస్కారం లేకుండా సేంద్రియ వ్యవసాయ విధానంపై ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగంతో ఒక్కో గ్రామం సుమారు రూ.4.24 కోట్ల మేరకు వైద్యం, తదితర అవసరాలకు వ్యయం చేయాల్సి వస్తోందనే అంశాన్ని ఉటంకిస్తూ.. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయంపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు.

**అధికారం ఉంటేనే మిత్రులు..**

సమకాలీన రాజకీయాల్లో అధికారం ఉన్నపుడు అనేక మంది మిత్రులుగా వస్తారని, అధికారం పోయాక మాయం అవుతారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కానీ.. చదువుకునే రోజుల నుండి మరణం వరకూ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి డాక్టర్ కేవీపీ రామచంద్ర రావు తోడు నీడగా నిలబడ్డారని ఆయన గుర్తుచేశారు. "కేవీపీలాగా ఉంటామంటూ కొంతమంది నా దగ్గరకు వస్తున్నారు.. వారిని మొదటి వారం లోపలికి రానిస్తే, రెండో వారం నా కుర్చీలో కూర్చుని 'నేనే అంతా నడుపుతాలే' అంటున్నారు" అని చెప్పి నవ్వులు పూయించారు. కేవీపీలా ఉంటామంటూ తనవద్దకు వచ్చినవారికి.. "మీరెప్పటికీ ఆయనలా కాలేరు.. అలాంటి ఆలోచన సైతం చేయవద్దు" అని సూచించినట్టు రేవంత్ తెలిపారు. 1978లో ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన వైఎస్.. ఆ తర్వాత ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికైనప్పటికీ ఆయనకు పదవులు దక్కలేదని, అనేక సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఆ సమయంలో ఆయన వెన్నంటి ఉన్న కేవీపీ.. వైఎస్ తప్పులను తన ఖాతాలో వేసుకుని, మంచిని వైఎస్ ఖాతాలో వేసి ఆయనకు ఆత్మలా పనిచేశారన్నారు. సర్వం త్యాగం చేయగల గుణం, సమస్యలను ఎదుర్కొనే శక్తి కేవీపీకి ఉందన్నారు. సభలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న హరియాణా మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా వైఎస్‌ను ప్రశంసించారు. రైతుల సమస్యలను పాదయాత్ర సమయంలో తెలుసుకున్న వైఎస్.. అధికారంలోకి రాగానే వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. ఇక.. వైఎస్‌తో కలిసి పనిచేయడం తనకు గర్వకారణమని డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయానికి ఏడుగంటల ఉచిత విద్యుత్ సాధ్యం కాదని అప్పట్లో అధికారులు అన్నప్పటికీ.. వైఎస్ ఆ పథకాన్ని అమలుచేసి రైతుబాంధవుడిగా నిలిచారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. పాలనలో సంస్కరణల ద్వారా రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాలపై చెరగని ముద్ర వేశారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. కాగా... ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, డాక్టర్ కేవీపీ రామచంద్రరావు, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల, ఎమెస్కో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సీబీఐకి ద్వారం తెరిచిన సర్కారు

అందుకు అనుగుణంగా తాజా జీవోను వెలువరించింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, నాణ్యత లోపాలు కారణమని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన తుది నివేదికలోని అంశాల ఆధారంగా సీబీఐ విచారణ జరపనుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కూడా జీఓలో ప్ర




భుత్వం పేర్కొంది. అయితే హైకోర్టులో మంగళవారం జరిగిన విచారణలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సిఫార్సులపై చర్యలు తీసుకోవడం లేదని, ఎన్‌డీఎస్ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో సీబీఐ ప్రవేశానికి వీలు కల్పిస్తూ.. సోమవారం ఇచ్చిన జీఓలో కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో వైఫల్యాలపై విచారణ అని పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకొంది. న్యాయ విచారణ కమిషన్ నివేదికపై కోర్టులో కేసు ఉన్నందున... ఎన్‌డీఎస్ఏ నివేదికలోని అంశాలపై విచారణ చేపట్టాలని కేంద్రానికి రాసిన లేఖలో ప్రభుత్వం పేర్కొన్నట్లు స్పష్టమవుతోంది. 2022 ఆగస్టులో జారీ చేసిన జీఓకు సడలింపు ఇస్తూ సోమవారం జారీ చేసిన జీఓను వెంటనే కేంద్రానికి పంపగా... అందినట్లు సీబీఐ డైరెక్టర్ నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ కూడా సోమవారమే వచ్చింది. దీంతో కాళేశ్వరం బ్యారేజీల అంశం సీబీఐ చేతిలోకి వెళ్లిపోయింది.

**జీఓలోని ముఖ్యాంశాలివీ...**

రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిరోధిస్తూ 2022 ఆగస్టు 30న జారీ చేసిన జీఓ 51ని సవరిస్తూ ప్రభుత్వం సోమవారం జీఓ 104ను జారీ చేసింది. ఏ అంశంపై విచారణ జరపాలో అందులో పేర్కొంది. కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టులో భాగంగా గోదావరిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ ఏడో బ్లాక్‌లో 16, 17, 18, 19, 20, 21వ పియర్స్ కుంగాయి. 2023 అక్టోబరు 22న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ... కమిటీని ఏర్పాటు చేసింది. అదే ఏడాది అక్టోబరు 24న ఆ కమిటీ పర్యటించి... నవంబరు 1న తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 2024 మే 1న మధ్యంతర నివేదిక, 2025 ఏప్రిల్ 24న తుది నివేదిక సమర్పించింది. నిర్మాణంలో లోపాలు, ప్లానింగ్, డిజైన్, నాణ్యత తనిఖీలు సరిగా లేకపోవడం వల్ల మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యం చెందినట్లు ఎన్‌డీఎస్ఏ పేర్కొంది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను తెలంగాణ ప్రభుత్వం 2024 మార్చి 14న ఏర్పాటు చేసింది. కమిషన్ ఈ ఏడాది జులై 31న నివేదిక సమర్పించింది. బ్యారేజీల నిర్మాణంలో లోపాలు చోటుచేసుకున్నాయని, అనేక అక్రమాలు జరిగాయని, తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సూచించింది. దీనిపై ఆగస్టు 4న మంత్రివర్గం చర్చించి, శాసనసభలో నివేదికను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఆగస్టు 31న శాసనసభలో చర్చించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై విచారణను సీబీఐకి అప్పగించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2022 ఆగస్టు 20న జారీ చేసిన ఉత్తర్వుకు సడలింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పబ్లిక్ సర్వెంట్స్, ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలపై దర్యాప్తునకు అవకాశం కల్పించింది. సీబీఐకి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జీఓలో పేర్కొనడంతోపాటు ఇదే అంశాన్ని కేంద్రానికి తెలిపింది.

**తదుపరి కార్యాచరణ ఇదీ...**

ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం... అన్ని అంశాలను సీబీఐ పరిశీలించి అనుమతి కోసం డీఓపీటీకి పంపుతుంది. దాన్ని డీఓపీటీ పరిశీలించి... దర్యాప్తు చేపట్టడానికి అంగీకరిస్తూ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అయితే సీబీఐ కేసు నమోదు చేయాలంటే గవర్నర్ అనుమతి అవసరం. సీబీఐ దర్యాప్తులో ప్రజాప్రతినిధులు బాధ్యులుగా తేలితే వారిని అరెస్టు చేయడానికి గతంలో గవర్నర్ అనుమతి అవసరమయ్యేది. అయితే చట్టంలో జరిగిన మార్పుల ప్రకారం ముందుగానే గవర్నర్ అనుమతి అవసరమని సంబంధిత వర్గాలు తెలిపాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లను తప్పుపట్టింది. ఎన్‌డీఎస్ఏ నివేదికలో ప్రజాప్రతినిధుల పేర్లు లేనందున... ఈ నివేదిక ఆధారంగా సీబీఐ కేసు నమోదుకు గవర్నర్ అనుమతి అవసరం అవుతుందో, లేదో చూడాల్సి ఉంటుందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఎన్నికల వాయిదాకే మొగ్గు?



ఈకబురు, హైదరాబాద్:స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం ఎటూ తేలక పోవడంతో.. వాటిని మరో రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అందుకోసం హైకోర్టును ఆశ్రయించాలనే ఆలోచనతోప్రభుత్వం ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 30వ తేదీలోగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలను అమలుచేయటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

**రిజర్వేషన్లు తేలకపోవటంతో..**

స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ అసెంబ్లీలో ఇటీవల బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై గవర్నర్ న్యాయ సలహా కోరుతూ న్యాయ నిపుణులకు పంపించినట్లు తెలిసింది. దీంతో బిల్లుపై నిర్ణయం తీసుకోడానికి రాజ్‌భవన్‌కు కొంత సమయం ఇచ్చి వేచిచూడాలనే యోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. ఒకవేళ రాజ్‌భవన్ నుంచి ఈ బిల్లును రాష్ట్రపతికి పంపించినా వెంటనే అక్కడి నుంచి ఏదో ఒక నిర్ణయం వెలువడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అందువల్ల మరో రెండుమూడు నెలల తర్వాత బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. వెనుకబడిన తరగతుల వారికి స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ముందుగా బీసీ సంక్షేమ శాఖ జీఓ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వచ్చాక పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్ల ఫార్ములా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో కోటా నిర్ధారణ, ప్రభుత్వపరంగా ఎన్నికల తేదీల నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇదంతా పూర్తి కావటానికి మరికొంత సమయం పడుతుందని అంటున్నారు. మరోవైపు ప్రభుత్వపరంగా రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల తేదీల నిర్ణయంతో సంబంధం లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఎన్నికల నిర్వహణ సన్నాహాలను వేగవంతం చేసింది.

మొదటి పేజీ తరువాయి

## అత్యాచార నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష



ఈకబురు, శేరిలింగంపల్లి : మాయమాటలతో నమ్మించి బాధితురాలిపై అత్యాచారం చేసిన నిందితుడికి ఎల్బీనగర్ కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. జైలు శిక్షతో పాటు 5,100 రూపాయల జరిమానా, బాధితురాలికి 2లక్షల పరిహారం అందించాలని తీర్పు చెప్పింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో చోటుచేసుకున్న కేసుపై ఎల్బీనగర్ కోర్టు తీర్పు వెల్లడించింది. స్వాగత్ కుమార్ బోయ్(34) అనే వ్యక్తి బాధితురాలికి మాయమాటలు చెప్పి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలు సంవత్సరాల పాటు అత్యాచారం చేశాడు. బాధితురాలు పెళ్లి కోసం ఒత్తిడి తేవడంతో మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు నిందితుడు ప్రయత్నించి, బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితురాలు 2017లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ కేసుపై విచారించిన ఎల్బీనగర్ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జీ ఎం.వాణీ తాజాగా తుది తీర్పు వెల్లడించారు. నిందితుడు స్వాగత్ కుమార్ కు 20 సంవత్సరాల జైలు శిక్ష, 5,100 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. దీంతో పాటు బాధితురాలికి 2లక్షల పరిహారం అందించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో పక్కాగా ఆధారాలను సమర్పించిన గచ్చిబౌలి పోలీసులను కోర్టు అభినందించింది.

## షికాగో.. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన నగరం: డొనాల్డ్ ట్రంప్



ఈ-కబురు, నేరాలను తగ్గించే లక్ష్యంతో పలు నగరాల్లో కేంద్ర బలగాలను రంగంలోకి దించుతామని చెబుతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా షికాగోపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన నగరంగా పేర్కొన్న ఆయన.. ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. స్థానిక గవర్నర్ అసమర్థత వల్లే నగరంలో నేరాలు పెరుగుతున్నాయని ఆరోపించారు.

"ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన నగరం షికాగో. ఈ వారాంతంలో 54 మందిపై కాల్పులు జరగ్గా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. గత రెండు వారాల్లో ఇలాంటి ఘటనలే చోటుచేసుకున్నాయి. స్థానిక గవర్నర్‌కు సాయం అవసరం. ఆయనకు ఇంకా ఈ విషయం తెలియట్లేదు. వాషింగ్టన్ డీసీలో మాదిరిగా నేనే ఈ సమస్యను వేగంగా పరిష్కరిస్తా. త్వరలోనే షికాగో సురక్షిత నగరంగా మారుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

వరద నీటిని టబ్బుల్లో పట్టుకోండి - పాక్ రక్షణ మంత్రి

శాంతిభద్రతల విషయంలో కొన్ని దేశ రాజధానులతో పోలిస్తే వాషింగ్టన్‌లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని ఇటీవల పేర్కొన్న ట్రంప్.. కేంద్ర బలగాలను మోహరించారు. ఆ తర్వాత అమెరికాలోని పలు నగరాలపై ఇటువంటి చర్యలే చేపట్టారు. అక్రమ వలసదారుల ఏరివేతే లక్ష్యంగా లాస్‌ఏంజెలెస్‌లో ఫెడరల్ అధికారులు చేపట్టిన తనిఖీలు ఉద్రిక్తతలకు దారి తీయడంతో అక్కడికి నేషనల్ గార్డు బృందాలను తరలించారు. అసమర్థ గవర్నర్, మేయర్‌ల వల్లే లాస్ ఏంజెలెస్‌లో ఆ పరిస్థితులు నెలకొన్నాయని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన ట్రంప్.. తాజాగా షికాగోపైనా ఇటువంటి వ్యాఖ్యలే చేశారు.

## సాంప్రదాయ నేరాల కంటే సైబర్ నేరాలే ఎక్కువయ్యాయి: డిజిపి డాక్టర్ జితేందర్

### త్రిపుల్ ఐటీలో నూతన సైబర్ మంథన్, వ్యూహా ల్యాబ్స్ ఆవిష్కరణ



నూతన ల్యాబ్ ను ప్రారంభిస్తున్న డిజిపి జితేందర్, శిఖా గోయల్, సందీప్ కే. శుక్లా తదితరులు



వార్షిక అలుమినీ అవార్డులను అందజేస్తున్న డిజిపి జితేందర్

ఈకబురు, శేరిలింగంపల్లి : సాంప్రదాయ నేరాల కంటే నేడు సైబర్ నేరాలే ఎక్కువయ్యాయని, తెలంగాణ రాష్ట్రంలో నమోదవుతున్న పోలీసు కేసుల్లో సైబర్ నేరాల శాతం గణనీయమని రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (త్రిపుల్ ఐటి) 28వ వార్షికోత్సవ వేడుకలకు మంగళవారం డిజిపి జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టిజిసిఎస్బి) డైరెక్టర్ శిఖా గోయల్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రిపుల్ ఐటిలో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ మనేజ్మెంట్ అండ్ నెక్స్ట్ జెన్ టెక్నాలజీ అడ్వాన్స్ మెంట్ నెట్వర్క్ సెంటర్ సైబర్ మంథన్',

టిజిసిఎస్బి సైబర్ ఇన్నోవేషన్ ల్యాబ్ 'వ్యూహా ల్యాబ్" ను డిజిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిజిపి జితేందర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నా.. తెలంగాణలో మాత్రం ప్రోయాక్టివ్ పోలీసింగ్ ద్వారా సైబర్ నేరాలను 11శాతం తగ్గించగలిగామని అన్నారు. దీంతో పాటు దేశ వ్యాప్తంగా సైబర్ నేరాల కారణంగా ఆర్థిక నష్టాలు పెరుగుతుంటే తెలంగాణలో మాత్రం 20శాతం ఆర్థిక నష్టాలు తగ్గాయని తెలిపారు. త్రిపుల్ ఐటి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైబర్ మంథన్, వ్యూహా ల్యాబ్ పరిశోధన కేంద్రాలు ఆకడమిక్ సంస్థలు, స్టార్టప్ లు, ఇన్నోవేటర్లకు ఉపయోగపడడమే కాకుండా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసులకు మేలు చేస్తాయని అన్నారు. త్రిపుల్ ఐటీ దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఒకటని, ఎంతోమంది మేధావి విద్యార్థులకు త్రిపుల్ ఐటీ కలల గమ్యమని తెలిపారు. భవిష్యత్తులో త్రిపుల్ ఐటీ నుంచి మరిన్ని సరికొత్త ఆవిష్కరణలు, విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. టిజిసిఎస్బీ డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ ప్రపంచంలోనే వేగంగా పెరుగుతున్న నేరం సైబర్ నేరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 11.9 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల నష్టం సైబర్ మోసాల కారణంగా జరిగిందని తెలిపారు. అమెరికా, చైనా తరువాత మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థతో ఇది సమానమన్నారు. 2024లో భారత దేశం సైబర్ మోసాల కారణంగా 24వేల కోట్ల నష్టాన్ని చవిచూసిందని, అందులో తెలంగాణ వాటా 1,900 కోట్లు అని అన్నారు. ప్రతిరోజు సగటున 250 కొత్త కేసులు నమోదవుతున్నాయని, దాదాపు 5కోట్ల వరకు నష్టాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా చూస్తే తెలంగాణలో 11శాతం తగ్గుదల నమోదైందని, ఇన్నోవేషన్, సమన్వయంతో సైబర్ నేరాలను నియంత్రించవచ్చని నిరూపితమైందన్నారు. తెలంగాణ టీ4సి (తెలంగాణ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) దేశ వ్యాప్తంగా ఉన్న ఐ4సికి మోడల్ గా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా త్రిపుల్ ఐటీ హైదరాబాద్, టిజిసిఎస్బీలు అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. అనంతరం పలు విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి త్రిపుల్ ఐటీ వార్షిక అలుమినీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రిపుల్ ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కే.శుక్లాతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లండన్‌లో ఇద్దరు తెలంగాణ విద్యార్థుల మృతి

ఈకబురు, హైదరాబాద్ ,ఉప్పల్: లండన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ యువకులు దుర్మరణంపాలయ్యారు. మృతులను నాదర్ గుల్‌కు చెందిన చైతన్యయాదవ్ (అభి), పీర్జాదిగూడకు చెందిన రిషితేజ (21)గా గుర్తించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన తర్రె ఐలయ్యయదవ్, మంగమ్మ దంపతులకు చిన్న కుమారుడు చైతన్యయాదవ్ (23) బీటెక్ పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం ఈ ఏడాది జనవరిలో లండన్ వెళ్లాడు.





బోడుప్పల్ లోని పీర్జాదిగూడ మున్సిపాలిటీ అమృత కాలనీలో నివా ముండే రాపోలు రవీందర్‌రావు, కిరణ్మయి దంపతుల కుమారుడు రిషితేజ (21)హైదరాబాద్‌లో బీబీఏ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం గత మే నెలలో లండన్ వెళ్లాడు. వీరు మరికొందరు తెలుగు విద్యార్థులతో కలిసి అక్కడ నివా సం ఉంటున్నారు. వినాయక చతుర్థిని పురస్కరించుకుని స్నేహితులంతా గణనాథున్ని ప్రతిష్టించారు. ఆదివారం సాయంత్రం నిమజ్జనం కోసం 9 మంది రెండు కార్లలో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు మలుపు వద్ద వారి కారును వెనక నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. వెనుక వస్తున్న ట్రక్కు రెండు కార్లను ఢీకొట్టడంతో కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో చైతన్య యాదవ్, రిషితేజ మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

రెండు కుటుంబాల్లో విషాదం

ఇద్దరు యువకుల మరణంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. చైతన్యయాదవ్ మరణవార్తతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రిషితేజ చివరగా తల్లి కిరణ్మయితో ఆదివారం మాట్లాడాడు. 'నిద్ర వస్తోంది.. లేచాక మాట్లాడతాను అని చెప్పిన మాటలే చివరివి అయ్యాయి'అని అతడి తండ్రి రవీందర్‌రావు కన్నీరు మున్నీరయ్యాడు.

## కవిత ఎందుకిలా చేసింది

**ఎంపీగా గెలిపించాం..**
**ఓడితే ఎమ్మెల్సీ ఇచ్చాం**
**మద్యం కేసులో**
**అరెస్టయితే ఎంతో ఖర్చు**
**పెట్టి లాయర్లను పెట్టాను**
**బీఆర్ఎస్ నేతలతో**
**కేసీఆర్.. సస్పెండ్ చేస్తే**
**పార్టీ పెడుతుందా? అని**
**ఆరా**
**కవితను బహిష్కరిస్తే**
**మంచిదన్న జగదీశ్‌రెడ్డి!**



ఈకబురు,పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ తన కూతురు కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసిన కేసీఆర్.. ఆమె తీరు పట్ల పార్టీ నేతల వద్ద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కవితను సస్పెండ్ చేసే ముందు ఫాంహౌస్‌లో ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ''కవితకు ఏం తక్కువ చేశాను? నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసే అవకాశమిచ్చి గెలిపించుకున్నాం. రెండోసారీ చాన్స్ ఇచ్చాను. ఎంపీగా ఓడిపోతే ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాను. మద్యం కేసులో అరెస్టయితే ఎంతో ఖర్చుపెట్టి పెద్ద పెద్ద అడ్వకేట్లతో వాదించాం? అయినా కవిత ఎందుకిలా చేసింది?'' అని కేసీఆర్ అన్నట్లు తెలిసింది. కాగా, పార్టీ నేతలు కవితపై తమ అభిప్రాయాలు చెప్పే సమయంలో కొన్ని అంశాలను కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. కవిత సీఎం రేవంత్ ఫోల్డర్‌లో పనిజేస్తున్నారంటూ కొన్ని ఆధారాలు కూడా చూపించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే కవితను సస్పెండ్ చేస్తే ఆమె ఏం చేస్తుందోనన్న అంశంపై కూడా కేసీఆర్ చర్చించినట్లు, కొత్త పార్టీ పెడుతుందా? అని ఆరా తీసినట్లు తెలిసింది. అయితే సస్పెండ్ చేస్తే కాంగ్రెస్‌లో చేరతారని, కవితకు మంత్రి పదవి కూడా ఇచ్చే అవకాశం ఉందని పార్టీ నేతలు కేసీఆర్‌కు వివరించారు. దీంతో, ''కాంగ్రెస్ ప్రభుత్వం ఒకవేళ కవితకు మంత్రి పదవి ఇస్తే అది మనకే లాభం'' అని కేసీఆర్ అన్నట్లు సమాచారం. కాగా, కవితను సస్పెండ్ చేయడం వల్ల భవిష్యత్తులో ఇంకెవరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరని, ఎంతటి వారినైనా సస్పెండ్ చేస్తారనే భయం కలుగుతుందని కొందరు నేతలు కేసీఆర్‌తో అన్నట్లు తెలిసింది. కవితను సస్పెండ్ చేయని పక్షంలో అనేక మంది పార్టీలో ఉంటూ పార్టీకే నష్టం కలిగించేలా వ్యవహరిస్తారని చర్చకు వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా కేసీఆర్ కూతురి విషయంలో ఏకపక్షంగా ఉంటున్నారని ప్రచారం పెరుగుతుందని, సస్పెండ్ చేస్తే వ్యతిరేకంగా పనిచేసే వారికి హెచ్చరికగా ఉండడంతో పాటు గతంలో చెప్పిన విధంగా పార్టీయే తన కుటుంబంగా కేసీఆర్ భావించారని ప్రజల్లో ప్రచారం జరుగుతుందని భావించినట్లు తెలిసింది. ఇటీవల కవిత 'లిల్లీపుట్' అంటూ వ్యాఖ్యానించిన నేత.. ఆమెను బహిష్కరిస్తేనే పార్టీకి మంచిదని చెప్పినట్లు సమాచారం. నేతలందరి అభిప్రాయాలు విన్న కేసీఆర్.. చివరికి కవితపై వేటు వేయాలన్న నిర్ణయానికి వచ్చారు..

## ఐదు రోజులూ వర్షా లే...

ఈకబురు, తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. 3వ తేదీ: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలివేగం గంటకు 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో అక్కడక్కడా కురవొచ్చు. 4వ తేదీ: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కుమురంభీంఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో అక్కడక్కడా కురవొచ్చు. 5వ తేదీ: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, వరంగల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశముంది. బలమైన ఉపరితల గాలులు (వేగం గంటకు 30-40 కి.మీ.) జనగాం, ఖమ్మం, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా వీచే అవకాశం ఉంది. 6వ తేదీ: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల (వేగం 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. హనుమకొండ, హైదరాబాద్, జనగాం, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా బలమైన ఉపరితల గాలులు (వేగం 30-40 కి.మీ.) వీచే అవకాశం ఉంది. 7వ తేదీ: అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (వేగం గంటకు 30-40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.



## ఆర్థిక సవాళ్లున్నా తగ్గేదేలే!



**ఏప్రిల్-జూన్‌లో 7.8% వృద్ధి సాధించాం**

**10 సెమీకండక్టర్ ప్రాజెక్టుల్లోకి రూ.1.58 లక్షల కోట్లు**

**సెమీకాన్ ఇండియా సదస్సులో ప్రధాని మోదీ**

**తొలి దేశీయ తయారీ చిప్ ఆవిష్కరణ**

ఈకబురు,ఢిల్లీ: త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. భారత్ అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. అందుకు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సాధించిన జీడీపీ వృద్ధి గణాంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. ఢిల్లీలోని యశోభూమిలో 'సెమీకాన్ ఇండియా 2025' సదస్సును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితులు, ఆర్థిక సవాళ్లున్నా తొలి త్రైమాసికంలో మన దేశం 7.8 శాతం వృద్ధి రేటు సాధించింది. ఈ సదస్సులో 50 దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొనడం సంతోషంగా ఉంది. ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగింది. సెమీ కండక్టర్ల రంగంలో ప్రపంచ దేశాలు మనతో కలిసి వస్తున్నాయి. మన దేశం త్వరితగతిన సరికొత్త శిఖరాలు అధిరోహిస్తోంది' అని అన్నారు.

ఎన్ని అడ్డంకులు ఎదురైనా..

అమెరికా విధిస్తున్న సుంకాలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల ఆర్థిక స్వార్థం వల్ల మనకు ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని తెలిపారు. భారత్‌పై అమెరికా భారీగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో ప్రధాని మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందన్నారు. అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నా భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు మేకిన్ ఇండియా కోసం భారత్‌కు తరలి రావాలని.. ఇక్కడి నుంచి ప్రపంచం కోసం తయారీ చేపట్టాలని పిలుపునిచ్చారు. భారత్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వంటి పలు మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. వృద్ధి కేవలం ఒక రంగానికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లోనూ కనిపిస్తోందన్నారు. భారత్‌లో తయారైన ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు ప్రపంచ దేశాలన్నీ చెప్పుకొనే రోజు త్వరలోనే వస్తుందని పేర్కొన్నారు.

తొలి మైక్రో చిప్ మోదీకి అందజేత

ఇండియా సెమీకండక్టర్ మిషన్ తదుపరి దశలో 18 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.58 లక్షల కోట్ల) 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులు మన దేశంలో రాబోతున్నాయని మోదీ వెల్లడించారు. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక (డీఎల్ఐ)పథకం లక్ష కోట్ల డాలర్ల అంతర్జాతీయ చిప్ మార్కెట్‌ను సైతం అందిపుచ్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సెమీకాన్ ఇండియా సదస్సులో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, జితిన్ ప్రసాద, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు. మేకిన్ ఇండియా తొలి మైక్రో చిప్‌ను ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అందించారు. సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటోందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

## ప్రజాస్వామ్య నైతికత

ఈకబురు,భారతీయ నాగరికత ప్రభవ ప్రాభవాలకు హిమాలయాలు ఎంత ముఖ్యమో భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య విశిష్టతా వికాసాలకు సార్వజనీన ఓటు హక్కు అంతే ప్రధానమైనది. కులమతాలకు అతీతంగా, విద్యార్హతలు, ఆర్థిక స్థాయితో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా భారత గణతంత్ర రాజ్య వ్యవస్థాపకులు భారతీయుల ప్రజాస్వామిక ప్రస్థానాన్ని సుస్థిరమూ, స్ఫూర్తిదాయకమూ చేశారు. అతడు/ఆమె ప్రజాస్వామిక ప్రక్రియలో విధిగా పాల్గొనేలా చేయడంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) బాధ్యత బృహత్తరమైనది. మన గణతంత్ర రాజ్యం కంటే ఒక రోజు ముందే (జనవరి 25, 1950) ఏర్పడిన ఈ రాజ్యాంగ సంస్థ ఇటీవలి కాలంలో తన గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదనే సందేహాలు సామాన్యులలోను, పాలకపక్షం ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా వ్యవహరిస్తోందనే భయాందోళనలు రాజకీయ పక్షాలలోను వ్యక్తమవుతున్నాయి. ఆ భయ సందేహాలు సహేతుకమైనవని సోమవారం నాడు పట్నాలో ముగిసిన జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఓటర్ అధికార్ యాత్ర నిర్ధారించింది. మూడు సంవత్సరాల క్రితం కన్యాకుమారి నుంచి నుంచి కశ్మీర్ దాకా రాహుల్ నిర్వహించిన భారత్ జోడో యాత్ర భారత జాతీయ కాంగ్రెస్‌కు ప్రజాదరణను పెంపొందించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరాది రాష్ట్రాలలో బీజేపీ ఆధిక్యతను కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గణనీయంగా దెబ్బతీశాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం నాలుగు నెలల వ్యవధిలో మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు జరిగిన ఎన్నికలలో బీజేపీ విజయం సాధించింది. మహారాష్ట్రలో, ఓటర్ల జాబితాలో మోసపూరితంగా దాదాపు నలభై లక్షల కొత్త ఓటర్లను చేర్చడం, అక్రమంగా పలువురు ఓటర్ల పేర్లను తొలగించడం వల్లే బీజేపీకి విజయం సాధ్యమయిందని రాహుల్ ఆరోపించారు. అలాగే గత లోక్‌సభ ఎన్నికలలో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ జాబితాలలో ఘోరమైన అవకతవకలు చోటుచేసుకున్నాయని, లక్షకు పైగా ఓట్లు అనుమానాస్పదమైనవని ఈసీ ఇచ్చిన జాబితాల ఆధారంగానే రాహుల్ నిరూపించారు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు ఈసీఐ సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది. జూన్‌లో బిహార్‌లో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈసీఐ చేపట్టింది. ఈ సంవత్స రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇంత తక్కువ వ్యవధిలో హడావుడిగా ఈ సవరణ కార్యక్రమాన్ని చేపట్టడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. బీజేపీకి తోడ్పడేందుకే లక్షలాది ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణను ఈసీఐ చేపట్టిందని రాహుల్ తప్పు పట్టారు. ఆగస్టు 1న ఈసీఐ ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాలలో 65 లక్షల పేర్లను మినహాయించినట్టు వెల్లడవడంతో ప్రజల సందేహాలు మరింత బలపడ్డాయి. ముసాయిదా జాబితాలను నిశితంగా పరిశీలిస్తే పేర్ల తొలగింపుతో నష్టపోయిన ఓటర్లలో అత్యధికులు అణగారిన వర్గాలవారు, మతపరమైన మైనారిటీలు, మహిళలు ఉన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణను వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, పిదప దేశమంతటా నిర్వహిస్తామని ఈసీఐ ఇప్పటికే ప్రకటించడంతో కోట్లాది పౌరులు తమ ఓటుహక్కును కోల్పోయే ముప్పు వాటిల్లనున్నది. ఇదే జరిగితే ప్రజాప్రాతినిధ్యానికి అర్థమేమున్నది.? ఈ విపత్కర పరిస్థితులపై ప్రజలను జాగృతం చేసేందుకే జాతీయ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ బిహార్‌లో 16 రోజుల పాటు ఓటర్ అధికార్ యాత్ర నిర్వహించారు. ప్రజలు అపూర్వంగా ప్రతిస్పందించారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో సమైక్యత వెల్లివిరిసింది. ఈ సానుకూల పరిస్థితులను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు రాహుల్ మరింత దృఢ సంకల్పంతోను, రాజనీతిజ్ఞతతోను వ్యవహరించవలసి ఉన్నది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థలో ఇటువంటి అపసవ్యతలు చోటుచేసుకున్నప్పుడు అధికారంలో ఉన్నవారిని వేలెత్తి చూపకుండా ప్రతిపక్షాలు ఉండలేవు. ఎందుకంటే ప్రజాస్వామ్య నైతికతే ఓటుహక్కు. ఆ నైతికత భ్రష్టం కాకుండా భద్రంగా, ప్రయోజనకరంగా ఉండేలా జాగ్రత్త వహించడం ప్రతి విద్యావంతుడి విద్యుక్తధర్మం.



# ఎయిరిండియా గుడ్‌న్యూస్.. ఆ ప్రయాణికుల కోసం భారీ డిస్కౌంట్లు

**ప్రముఖ దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియా సీనియర్ సిటిజెన్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. 60ఏళ్లు, ఆపైబడిన ప్రయాణికులకు రాయితీలు ప్రకటించింది. వారు చేసే దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు ఈ రాయితీలు వర్తిస్తాయని వెల్లడించింది .**




**అంతర్జాతీయ ప్రయాణాల కోసం..**
తమ కొత్త స్కీమ్ కింద టికెట్ బేస్ ధరపై 10 శాతం తగ్గింపు ఇస్తామని ఎయిరిండియా వెల్లడించింది. ఎకానమీ నుంచి ఫస్ట్‌క్లాస్ వరకు అన్ని క్యాబిన్లకు ఇది వర్తిస్తుంది. ఒకసారికి ప్రయాణ తేదీని మార్చుకోవడానికి వీలుంది. అయితే అప్పుడు ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటే చెల్లించాల్సి ఉంటుంది. ఒక ప్రయాణికుడు 10కేజీలు అదనంగా లగేజీ తీసుకెళ్లేందుకు అనుమతి ఉంది. లేకపోతే.. ఎకానమీ, ప్రీమియం ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించేవారు 23 కేజీల బరువున్న రెండు లగేజీలను తీసుకెళ్లొచ్చు. అదే సమయంలో బిజినెస్ క్లాస్‌లో వెళ్లేవారు 32 కేజీల బరువున్న రెండు లగేజీలను వెంట తీసుకెళ్లొచ్చు.

**దేశీయ విమాన ప్రయాణాల్లో అయితే..**
విమాన టికెట్ బేస్ ధరలో 25 శాతం తగ్గింపు లభించనుంది. సీనియర్ సిటిజెన్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే.. ఈ రాయితీని పొందొచ్చు. ఒక డేట్ ఛేంజ్‌కు అవకాశం ఉండగా.. 15 కేజీల అదనపు బ్యాగేజీని అనుమతించనున్నారు. ఇవిగాక.. ప్రోమోకోడ్‌ను ఉపయోగించి యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే.. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాల్లో ఒక్కో ప్రయాణికుడికి అదనపు లబ్ధి చేకూరనుంది. వెబ్‌సైట్, యాప్‌లో ఈ ప్రయోజనాన్ని పొందొచ్చు.

**ఈ ఆఫర్‌ను ఎలా పొందొచ్చు..**
ఎయిరిండియా సిటీ లేకపోతే ఎయిర్‌పోర్ట్ టికెటింగ్ ఆఫీసెస్, కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్, వెబ్‌సైట్, యాప్ ద్వారా సీనియర్ సిటిజెన్లు టికెట్లు కొనుగోలుచేయొచ్చు. ఆ సమయంలో పుట్టిన తేదీ నిరూపించేలా చెల్లుబాటయ్యే ఫొటో ఐడీని చూపించాల్సి ఉంటుంది. టికెటింగ్, చెక్ఇన్, బోర్డింగ్ సమయంలో ప్రయాణికులు వారి ఐడీని సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ అందులో విఫలమైతే.. పెనాల్టీ కూడా పడొచ్చు. ఈ స్కీమ్‌కు సంబంధించి ఏవైనా సవరణలు ప్రకటిస్తే తప్ప.. అప్పటివవరకు వన్‌వే, రిటర్న్ బుకింగ్స్‌కు ఈ రాయితీలు వర్తించనున్నాయి. అయితే, ఎప్పుడైనా ఈ స్కీమ్‌లో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని తన షరతుల్లో ఎయిరిండియా వెల్లడించింది.

# ఇండియాలో 600 మాత్రమే!.. అమెరికా బ్రాండ్‌కు బుకింగ్స్..

**ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ.. టెస్లా జూలై మధ్యలో భారతదేశంలో అమ్మకాలు ప్రారంభించింది. అప్పటి నుంచి కంపెనీ కేవలం 600 కార్లకు మాత్రమే ఆర్డర్లు పొందింది. అయితే కంపెనీ ఈ ఏడాది 350 నుంచి 500 కార్లను మాత్రమే ఇండియాలో విక్రయించాలని చూస్తోంది. టెస్లా మొదటి బ్యాచ్ సెప్టెంబర్ ప్రారంభంలో షాంఘై నుంచి రానుంది.**



టెస్లా కంపెనీ ముంబై, ఢిల్లీ, పూణే, గురుగ్రామ్ నగరాల్లో మాత్రమే తమ మొదటి డెలివరీలను ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తరువాత దేశంలోని ఇతర నగరాలకు కూడా విస్తరించనుంది. ఇప్పటికే సంస్థ దేశంలో రెండు డీలర్షిప్లను ప్రారంభించింది. ఛార్జింగ్ స్టేటన్స్ కూడా ఏర్పాటు చేయడంలో టెస్లా నిమగ్నమై ఉంది.

**టెస్లా మోడల్ వై**
టెస్లా మోడల్ వై అనేది.. ప్రస్తుతం భారత మార్కెట్లో అందుబాటులో ఉన్న టెస్లా ఏకైక మోడల్. ఎంట్రీ లెవల్ మోడల్ Y రియర్‌వీల్ డ్రైవ్ (RWD) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు (ఎక్స్‌షోరూమ్), లాంగ్ రేంజ్ RWD వెర్షన్ రూ. 67.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. రెండు మోడళ్ల డెలివరీలు 2025 మూడవ త్రైమాసికంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.స్టాండర్డ్ మోడల్ Y RWD 60 kWh బ్యాటరీతో.. ఒక ఛార్జ్‌పై 500 కిమీ రేంజ్ అందిస్తుంది. కాగా లాంగ్ రేంజ్ వేరియంట్ 75 kWh బ్యాటరీ ఒక ఛార్జ్‌పై 622 కిమీ రేంజ్ అందిస్తుంది. రెండు వెర్షన్‌లు దాదాపు 295 హార్స్‌పవర్‌ను ఉత్పత్తి చేసే ఒకే ఎలక్ట్రిక్ మోటారు ద్వారా శక్తిని పొందుతాయి. పర్ఫామెన్స్ విషయానికి వస్తే.. టెస్లా మోడల్ వై బేస్ RWD మోడల్ 5.9 సెకన్లలో 0 నుంచి 100 కిమీ/గం వేగాన్ని అందుకుంటుంది, అయితే లాంగ్ రేంజ్ వెర్షన్ కొన్ని 5.6 సెకన్లలో ఈ వేగాన్ని చేరుకుంటుంది. అయితే వీటి టాప్ స్పీడ్ 201 కిమీ/గం.



## ఐఆర్‌డీఏఐ చైర్మన్‌గా అజయ్‌సేత్

బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కొత్త చైర్మన్‌గా ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి 'అజయ్ సేత్' సోమవారం బాధ్యతలు చేపట్టారు. 1987 బ్యాచ్ కర్ణాటక కేడర్ ఐఏఎస్ అధికారి అయిన సేత్ కేంద్ర ఆర్థిక శాఖలో నాలుగేళ్ల సుదీర్ఘ సేవల అనంతరం ఈ ఏడాది జూన్‌లోనే పదవీ విరమణ చేశారు. స్వల్ప విరామంతో ఆయన్ని కీలకమైన ఐఆర్‌డీఏఐ చైర్మన్ బాధ్యతల్లో కేంద్రం కూర్చోబెట్టడం గమనార్హం. బీమా రంగంలో ఆరోగ్యకరమైన పోటీకి, అందరికీ బీమా సేవల విస్తృతికి, ఉత్తమ ప్రమాణాల అమలుకు, పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు ఐఆర్‌డీఏఐ కృషి చేస్తుంటుంది.

# తొలి మేడిన్ ఇండియా చిప్ ‘విక్రమ్-32’ విశేషాలు తెలుసా..?




**సెమీకాన్ ఇండియా-2025లో భారత్ సెమీకండక్టర్ చరిత్రలో ఓ మైలురాయిగా ఉండిపోయింది. దీనిలో దేశీయంగా తయారు చేసిన తొలి చిప్ విక్రమ్-3201 ను ఆవిష్కరించారు. సెమీ కండక్టర్లలో స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ వేసిన తొలి అడుగుగా నిలిచింది. దీనిని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ - ది సెమీ కండక్టర్ లేబొరేటర్ (చండీగఢ్) సంయుక్తంగా రూపొందించాయి.**

**కఠిన పరిస్థితుల్లో కూడా..**
అత్యంత కఠినమైన పరిస్థితులను తట్టుకొని నిలబడేట్లుగా దీనిని రూపొందించారు. ఇది 55 డిగ్రీల చలి నుంచి +125 డిగ్రీల సెల్సియస్ వేడి వరకు తట్టుకోగలదు. ఈ సెమీ కండక్టర్ మైక్రో ప్రాసెసర్ మనం రోజువారీ వాడుకొనే ల్యాప్‌ట్యాప్, స్మార్ట్‌ఫోన్ వంటి పరికరాల్లో వినియోగించడానికి వీలు లేదు. కేవలం అంతరిక్ష పరిశోధనల కోసమే దీనిని రూపొందించారు. వీటిని రాకెట్స్, ఉపగ్రహాలు, లాంచ్ వెహికల్ ఏవియానిక్స్‌లో వాడనున్నారు. దీనిని 2009లో వచ్చిన విక్రమ్ 1601 చిప్‌నకు అప్‌గ్రేడ్‌గా చూడాల్సి ఉంటుంది.

**దీని 32 బిట్ ప్రాసెసర్ ఏమి చేస్తుంది..?**
ఈ చిప్‌ను లాంచ్ వెహికల్‌లో నేవిగేషన్, కంట్రోల్, మిషన్ మేనేజ్‌మెంట్, స్ప్లిట్ సెకన్లను గణించడం వంటివి చేస్తుంది. రాకెట్ సరైన మార్గంలో ప్రయాణించడానికి ఇవి చాలా కీలకం. అత్యంత కఠినంగా ఉండే అంతరిక్ష వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని.. దీనిని మిలటరీ గ్రేడ్ ప్రమాణాలతో నిర్మించారు. విక్రమ్32 సామర్థ్యాన్ని అత్యంత వేడి, చలి, భారీ ప్రకంపనలు, రేడియేషన్‌ల మధ్య పరీక్షించారు. 64 బిట్ చిప్ అత్యధికంగా ఏం చేయగలదో ఇది కూడా అంత సామర్థ్యం కలిగి ఉంది. ఇప్పటి వరకు 2009లో నిర్మించిన విక్రమ్16 బిట్ ప్రాసెసర్‌నే లాంచ్ వెహికల్‌స్‌కు వినియోగించారు.

**అంతరిక్షంలో పరీక్షించారా..?**
విక్రమ్32 ను అంతరిక్షంలో పరీక్షించారు. దీనిని పీఎస్ఎల్‌వీసీ60 ప్రాజెక్టులో వాడారు. దానిలోని ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంట్ మాడ్యూల్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో వినియోగించారు. దానిలో అద్భుతంగా పనిచేయడంతో ఇస్రోలో ఆత్మవిశ్వాసం వచ్చింది. ఈ ఏడాది మార్చి 5వ తేదీన విక్రమ్32, కల్పన 32 చిప్‌స్‌ను ఉత్పత్తి చేసి.. ఆ లాట్లను ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్‌కు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ అందజేశారు.

**ఎందుకు వీటికింత ప్రాధాన్యం..?**
అంతరిక్ష ప్రయోగాల్లో వినియోగించే చిప్స్ సాధారణంగా వాణిజ్య స్థాయిలో అందుబాటులో ఉండవు. చాలా కఠిన పరిస్థితులను తట్టుకొనేలా వాటిని రూపొందించాలి. ఇప్పటి వరకు భారత్ ఇటువంటి చిప్స్ కోసం వివిధ దేశాలపై ఆధారపడింది. విక్రమ్32తో భారత్ స్వయం సమృద్ధి సాధించింది.




ఈ చిప్ కేంద్రంగా.. భారత్ అడా కంపైలర్స్, అసెంబ్లర్స్, లింకర్స్, సిమ్యులేటర్లను అభివృద్ధి చేసుకోవడం విశేషం. దీంతో అంతరిక్ష కార్యక్రమాలకు అవసరమయ్యే పరికరాలు, హార్డ్‌వేర్, కీలక అప్లికేషన్ల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి పరిస్థితి తగ్గినట్లైంది.



## లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం నుంచి లాభాల్లో దూసుకెళ్తున్న దేశీయ స్టాక్ మార్కెట్లు.. మంగళవారం ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 206.61 పాయింట్లు లేదా 0.26 శాతం నష్టంతో 80,157.88 వద్ద.. నిఫ్టీ 45.45 పాయింట్లు లేదా 0.18 శాతం లాభంతో.. 24,579.60 వద్ద నిలిచాయి. కౌసల్య ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాజశ్రీ షుగర్స్ అండ్ కెమికల్స్, కొఠారి షుగర్స్ & కెమికల్స్ లిమిటెడ్, వన్ మొబిక్విక్ సిస్టమ్స్, విమ్టా ల్యాబ్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. ఐమ్కో ఎలెకాన్ (ఇండియా), జువారీ ఆగ్రో కెమికల్స్, బీఎస్ఎల్, ఎల్జీ రబ్బరు కంపెనీ, లుమాక్స్ ఆటోమొబైల్ కంపెనీ వంటివి నష్టాలను పొందాయి.




## ఓవైపు జీతాలు పెంపు.. మరోవైపు లేఆఫ్స్ భయం!

దేశంలోని అతిపెద్ద ఐటీ సేవల సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' 2025 సెప్టెంబర్ 1 నుంచి తన ఉద్యోగులకు వేతనాల పెంపును ప్రారంభించింది. మెజారిటీ సిబ్బందికి 4.5 నుంచి 7 శాతం వరకు జీతాలను పెంచినట్లు తెలుస్తోంది. అత్యుత్తమ పనితీరును కనపరించినవారికి 10 శాతం పెంచినట్లు సమాచారం. ఇంక్రిమెంట్ లెటర్లను కంపెనీ ఉద్యోగులకు అందించే ప్రక్రియను కూడా మొదలుపెట్టేసింది.
ఈ ఏడాది టీసీఎస్ తన ఉద్యోగులలో దాదాపు 80% మందికి ఇంక్రిమెంట్లు అమలు చేయనున్నట్లు గత నెలలోనే వెల్లడించింది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1 నుంచే వేతనాల పెంపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. కానీ ఆర్థిక అనిశ్చితులు, సవాలుతో కూడిన వ్యాపార వాతావరణం కారణంగా కొంత ఆలస్యమైంది.

**ఉద్యోగుల తొలగింపు**
టెక్నాలజీ పెరుగుతున్న సమయంలో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని టీసీఎస్ వెల్లడించింది. ఉద్యోగులలో 2 శాతం.. అంటే సుమారు 12000 మందిని తొలగించే అవకాశం ఉంది. ఇది టెక్ రంగంలో ఆందోళనలు రేకెత్తించింది. ఇలాంటి సమయంలోనే కంపెనీ జీతాలను పెంచి వారికి కొంత ఉపశమనం కల్పించింది. ఉద్యోగులను తొలగించే దిశలో ఇతర టెక్ దిగ్గజాలు కూడా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఏఐ కారణంగా భవిష్యత్తులో మరింత మంది ఉద్యోగులు.. ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.



## థాంక్స్ చిన్నన్నయ్యా.. మీరిచ్చిన ఆ పుస్తకమే నాలో ప్రేరణ నింపింది: పవన్

**తన పుట్టిన రోజు సందర్భంగా జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తనను విష్ చేస్తున్న ప్రముఖులందరికీ పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన సోదరుడు నాగబాబు పెట్టిన పోస్టుకు పవన్ ఆసక్తికరంగా స్పందించారు. "హృదయపూర్వక ధన్యవాదాలు చిన్నన్నయ్యా. మీరు' లా' చదివే సమయంలో బహుమతిగా ఇచ్చిన నానీ పాల్కివాలా గారు రచించిన అనే పుస్తకం నాలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడానికి ప్రేరణగా నిలిచింది. ఎమ్మెల్సీగా, జనసేన ప్రధాన కార్యదర్శిగా ప్రజా జీవితంలో మీ సేవలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.**

**నా జీవితానికి మార్గదర్శి నువ్వే అన్నయ్యా..**
చలనచిత్ర రంగంలో అగ్రనటుడిగా, ప్రజా జీవితంలో జనసేనానిగా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న కల్యాణ్‌బాబుకి జన్మదిన శుభాకాంక్షలు అంటూ సినీ అగ్రకథానాయకుడు చిరంజీవి అభినందించారు. ప్రజా సేవలో చూపుతున్న అంకితభావం చిరస్మరణీయమంటూ కొనియాడారు. ప్రజలందరి ఆశీస్సులతో, అభిమానంతో నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆశీర్వదిస్తూ చిరంజీవి పెట్టిన పోస్టుపై పవన్ స్పందించారు. ''నా జీవితానికి మార్గదర్శి, తండ్రి సమానులైన అన్నయ్య, పద్మ విభూషణ్ చిరంజీవికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మీ ఆశీస్సులు, ప్రేమాభిమానాలు, పుట్టినరోజు శుభాకాంక్షలు ఎంతో ఆనందం కలిగించాయి. సమాజానికి ఏదైనా చేయాలని, మీరు నేర్పిన సేవా గుణమే ఈరోజు జనసేన పార్టీ ద్వారా ప్రజలకు సేవ చేసేందుకు స్ఫూర్తినిచ్చింది. మీరు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, ఎల్లప్పుడూ నాతో పాటుగా కోట్లాది మందికి మార్గదర్శకుడిగా నిలవాలని కాంక్షిస్తున్నాను.. మీ తమ్ముడు'' అని సమాధానమిచ్చారు.

## అందుకే ఆఫర్స్ తిరస్కరించా.. 'లిటిల్ హార్ట్స్'తో నవ్విస్తా: శివాని



**హైదరాబాద్:** 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'తో తొలి ప్రయత్నంలోనే నటిగా ప్రేక్షకులను మెప్పించిన తెలుగమ్మాయి శివాని నాగరం . 'లిటిల్ హార్ట్స్' లో పూర్తి భిన్నంగా కనిపించనుంది. '#90s: ఏ మిడిల్‌క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి కథానాయకుడిగా సాయి మార్తాండ్ తెరకెక్కించిన చిత్రమిది. 'ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్స్' లో రూపొందిన ఈ సినిమాని నిర్మాత బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 5న థియేటర్లలోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాని పలు విశేషాలు పంచుకుంది.

**అవకాశం అలా వచ్చింది..**
''సంగీత దర్శకుడు సింజిత్ యెర్రమల్లి నా బాల్య స్నేహితుడు. ఆయన ద్వారా ఈ సినిమా గురించి తెలిసింది. డైరెక్టర్ సాయి మార్తాండ్ కథ చెప్పినప్పుడే నటించేందుకు ఆసక్తి కలిగింది. అందులో నాదే కాదు ఇతర పాత్రలనూ తీర్చిదిద్దిన విధానం బాగుంది. ఇంతకుముందు నేను నటించిన 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' తర్వాత కొన్ని అవకాశాలొచ్చాయి. కానీ, వాటిని అంగీకరించలేదు. కథాబలం ఉన్న సినిమాలే చేయాలని నిర్ణయించుకున్నా. థియేట్రికల్ మూవీనా, ఓటీటీ చిత్రమా? అనేది పట్టించుకోను. వెబ్ సిరీస్ అవకాశాలు వచ్చినా చేసేందుకు సిద్ధంగా ఉన్నా''

**వ్యక్తిగతంగా దగ్గరైన పాత్ర..**
''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమాలో ప్రేమకథతో పాటు ఎమోషనల్ కంటెంట్ ఉంది. 'లిటిల్ హార్ట్స్' దానికి భిన్నం. ఇంటర్ కాలేజీ బ్యాక్‌డ్రాప్‌తో వినోదాత్మకంగా సాగుతుంది. అందులో బాగా ఏడిస్తే.. ఇందులో నవ్వుతూ కనిపిస్తా. ప్రేక్షకులను నవ్విస్తా. 'లిటిల్ హార్ట్స్'లో కాత్యాయనిగా నటించా. పక్కింటి అమ్మాయిలా ఉండే ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా సిద్ధం కాలేదు. నిజ జీవితంలో నేను అలాగే ఉంటా. చదువులో నేను యావరేజ్. తొలి నుంచీ థియేటర్‌లో విడుదల చేయాలన్న ఆలోచనతోనే పని చేశాం. బన్నీ వాసు, వంశీ ముందుకొచ్చాక రిలీజ్‌కు మరింత స్కోప్ పెరిగింది. ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా విడుదలవుతోంది''

**వారు నుంచి నేర్చుకున్నాం..**
''మౌళి కంటెంట్ క్రియేటర్‌గా కెరీర్ ప్రారంభించి, యాక్టర్ అయ్యాడు. నేను నేరుగా సినిమాల్లోకి వచ్చా. నేను మౌళిలా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండలేను. ఈ సినిమా చిత్రీకరణ చాలా సరదాగా సాగింది. రాజీవ్ కనకాల, అనిత చౌదరి లాంటి వారి నుంచి నటనలో కొత్త విషయాలు తెలుసుకున్నాం. ఈ సినిమాలో నటిస్తున్నప్పుడు నా కాలేజీ రోజులు గుర్తొచ్చాయి. ఇందులోని పాటలకు చక్కని ఆదరణ దక్కింది. ప్రస్తుతం.. సుహాస్‌తో కలిసి 'హే భగవాన్'లో నటిస్తున్నా. షూటింగ్ చివరి దశలో ఉంది. మరో రెండు సినిమాల్లో నటించనున్నా'' అని తెలిపింది.

## కొత్త లోకా వివాదాస్పద సీన్.. దుల్కర్ సల్మాన్ సంస్థ క్షమాపణలు!

**మలయాళ చిత్రాలకు తెలుగులోనూ విపరీతమైన క్రేజ్ ఉంటోంది. కంటెంట్ బాగుంటే మనవాళ్ల థియేటర్లకు ఎగబడుతున్నారు. ఇటీవల రిలీజైన మరో మలయాళ చిత్రం కొత్త లోక ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. ఇప్పటికే ఈ సినిమా ఇండియన్ బాక్సాఫీస్ వద్ద రూ. 30 కోట్లకు పైగా నికర వసూళ్లను సాధించింది. ఈ మూవీలో కళ్యాణి ప్రియదర్శన్, నస్లెన్, శాండీ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు.**



అయితే ఈ సినిమాలోని ఓ సీన్ వివాదానికి దారితీసింది. బెంగళూరు మహిళలను కించపరిచేలా ఉందంటూ విమర్శలొచ్చాయి. దీంతో దుల్కర్ సల్మాన్‌కు చెందిన నిర్మాణ సంస్థ వేఫరర్ ఫిల్మ్స్ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మీ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న ఆ సన్నివేశాన్ని తొలగిస్తామని ట్వీట్ చేసింది. కన్నడ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నందుకు విచారం వ్యక్తం చేస్తున్నామని తెలిపింది. ఈ విషయంలో తమను క్షమించాలని కోరుతూ వేఫరర్ ఫిల్మ్స్ లేఖను పోస్ట్ చేశారు. ఈ సినిమాలో ఇన్‌స్పెక్టర్ నాచియప్ప గౌడ (కొరియోగ్రాఫర్ శాండీ పోషించిన పాత్ర) బెంగళూరుకు చెందిన మహిళలను వివాహం చేసుకోవడం ఇష్టం లేదని.. వారు క్యారెక్టర్ లెస్ అంటూ మాట్లాడారు. ఈ సీన్ బెంగళూరు మహిళలను కించపరిచేలా ఉందని సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. కన్నడ డైరెక్టర్ మన్సూర్ సైతం ఈ సినిమాపై విమర్శలు చేశారు. కన్నడ భీమ, మలయాళ చిత్రాలు ఆఫీసర్ ఆన్ డ్యూటీ, ఆవేశం, ఇప్పుడు కొత్త లోకా లాంటి సినిమాలతో బెంగళూరును మాదకద్రవ్యాలు, నేరాలకు రాజధానిగా చిత్రీకరించారని అన్నారు. ఒకప్పుడు, సినిమాల్లో అందమైన పట్టణంగా చూపించిన బెంగళూరు.. నియంత్రణ లేని వలసల కారణంగా ఇలాంటి స్థితికి చేరుకుందని ట్వీట్‌లో రాసుకొచ్చారు.






## అలా ఎందుకు చేస్తారని బాధపడుతుంటాను

సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లకు ఎప్పటికప్పుడు ఏదో ఒక ఇబ్బంది ఎదురవుతూనే ఉంటుంది. మరీ ముఖ్యంగా లైంగిక వేధింపులు లాంటివి ఏదో మూల వినిపిస్తూనే ఉంటాయి. ఈ విషయమై అప్పుడప్పుడు పలువురు కథానాయికలు స్పందిస్తూనే ఉంటారు. తమ అభిప్రాయాల్ని చెబుతుంటారు. ఇప్పుడు హీరోయిన్ కృతి సనన్ అలాంటి ఓ విషయం గురించి మాట్లాడింది. హీరోయిన్లని చిన్నచూపు చూడటం కరెక్ట్ కాదని చెప్పకొచ్చింది.

'సౌకర్యాల విషయంలోనే కాదు.. గౌరవించడంలోనూ చిన్నచూపు చూస్తుంటారు. హీరోలకు పెద్దకార్లు, లగ్జరీ రూమ్స్ ఇస్తారు. ఇది చాలా చిన్న విషయమే కావొచ్చు. కానీ అలా ఎందుకు చేస్తారని బాధపడుతుంటాను. కేవలం కార్లు, సౌకర్యాల గురించే కాదు మహిళలని తక్కువ చేసి చూడటం గురించి నేను మాట్లాడుతున్నాను. హీరోలతో సమానంగా గౌరవించడానికి మేం కూడ అర్హులమే. షూటింగ్ విషయంలోనూ ఇలానే జరుగుతోంది'

'హీరోలు సెట్స్‌కి ఆలస్యంగా వస్తారు. కానీ హీరోయిన్లు మాత్రం టైమ్ కంటే ముందే వెళ్లి వారి కోసం ఎదురుచూస్తూ ఉండాలి. అసిస్టెంట్ డైరెక్టర్లు నన్ను ముందే సెట్స్‌కి రావాలని పిలుస్తారు. హీరోలకు మాత్రం ఆ మాట చెప్పలేరు. ఇలాంటి ఆలోచనా విధానంలోనే మార్పు రావాలి' అని కృతి సనన్ తన ఆవేదన బయటపెట్టింది.

కృతి సనన్‌కి ఏయే సినిమాలు, హీరోలతో ఇలాంటి అనుభవం ఎదురైందో గానీ ధైర్యంగా బయటకు చెప్పింది. మిగతా హీరోయిన్లు మాత్రం కొందరు ఇలాంటి వాటికి సర్దుకుపోతూ ఉంటారు. 2023లో 'ఆదిపురుష్' మూవీతో పాన్ ఇండియా వైడ్ ప్రేక్షకుల్ని పలకరించిన కృతి సనన్.. తర్వాత ఓ నాలుగు చిత్రాలు చేసింది గానీ పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ప్రస్తుతం ఈమె చేతిలో రెండు చిత్రాలు ఉన్నాయి. అవికూడా అప్‌కమింగ్ హీరోలతో చేస్తున్నావే. ఈమె స్టార్ హీరోలతో పనిచేసే చాలాకాలమైపోయింది.



## రిలేషన్ విషయం చెప్పకనే చెబుతోందా?

సమంత ప్రస్తుతం సినిమాలేం చేయట్లేదు. కొన్ని నెలల క్రితం 'శుభం' అనే చిన్న చిత్రాన్ని నిర్మించింది. ఈ మూవీ హిట్ కాలేదు గానీ పెట్టిన డబ్బులు వచ్చేశాయి. మరోవైపు సమంత రిలేషన్ గురించి గత కొన్నిరోజులుగా రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. అందుకు తగ్గట్లే ఎప్పటికప్పుడు ఫొటోనో వీడియోనో వైరల్ అవుతూనే ఉంది. ఇప్పుడు కూడా రూమర్ బాయ్ ఫ్రెండ్‌తో కలిసి సామ్.. దుబాయి వెళ్లినట్లు అనిపిస్తుంది.

గతంలో హీరో నాగచైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకున్న సమంత.. నాలుగేళ్ల తర్వాత విడాకులు తీసుకుంది. అప్పటినుంచి సింగిల్‌గానే ఉంటుంది. అయితే సామ్ తనతో 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్' సిరీస్‌లు తీసిన రాజ్ నిడిమోరుతో ప్రేమలో ఉందని పుకార్లు గత కొన్నిరోజులుగా వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లు వీళ్లిద్దరూ అడపాదడపా కలిసి కనిపిస్తుండటం వీటికి ఊతమిస్తోంది.

తాజాగా ఓ ఫ్యాషన్ షో చూసేందుకు దుబాయి వెళ్లిన సమంత.. ఆ వీడియోని ఇన్ స్టాలో పోస్ట్ చేసింది. ఇందులోనే ఓ వ్యక్తి చేతిని పట్టుకుని కనిపించింది. అయితే ఆ వ్యక్తి రాజ్ నిడిమోరు అని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. ఈ వీడియో దిగువన వరుణ్ ధావన్, దిశా పటానీ, రుహానీ శర్మ తదితరులు కామెంట్ కూడా చేశారు.

మరోవైపు రాజ్ నిడిమోరుకు ఇదివరకే పెళ్లయింది. శ్యామలిని 2015లో వివాహమాడారు. రీసెంట్ టైంలో సమంత-రాజ్ మధ్య రూమర్స్ వస్తుండటంతో శ్యామలి.. పరోక్షంగా కొన్ని పోస్టులు పెడుతోంది. మరి సమంత.. ఈ బంధాన్ని ఏమైనా అధికారికంగా ప్రకటిస్తుందా లేదా ఇలానే రహస్యంగా ఉంచుతుందా అనేది చూడాలి?

## ఆస్కార్ రేసులో పా. రంజిత్ సినిమా.. ట్రైలర్ చూశారా..?

ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డుకు 'పాపా బుకా' చిత్రం రేసులో ఉంది. కోలీవుడ్ దర్శకుడు పా. రంజిత్ సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ చిత్రం అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 98వ అకాడమీ అవార్డులకు ఎంట్రీ ఇచ్చింది. పా. రంజిత్ ట్వీట్ తర్వాత ఈ చిత్రం ట్రైలర్ సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. పపువా న్యూ గినీ ద్వీపానికి చెందిన నోయెలెన్ తౌలా, పా. రంజిత్ , అక్షయ్ కుమార్ పరిజా సంయుక్తంగా ఈ మూవీని నిర్మించారు.




మూడు జాతీయ అవార్డులతో రికార్డ్ క్రియేట్ చేసిన మలయాళ దర్శకుడు బిజుకుమార్ దమోదరన్ 'పాపా బుకా' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 19, 2025న పపువా న్యూ గినియా దేశంలోని థియేటర్లలో రిలీజ్ కానుంది. ఆ తర్వాత అంతర్జాతీయ చలనచిత్రోత్సవ ప్రదర్శనలు, అకాడమీ అవార్డుల కోసం లాస్ ఏంజిలిస్‌లో ప్రదర్శించనున్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పీఎన్‌జీలో పోరాడిన భారతీయ సైనికుల గురించి ఈ చిత్రం చూపుతుంది.

ఈ సినిమా గురించి పా రంజిత్ ఏం చెప్పారంటే.. పా రంజిత్ తన ట్వీట్‌లో రాస్తూ.. 'అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 98వ అకాడమీ అవార్డులకు పాపా బుకా అధికారికంగా ఎంపికైంది. పపువా న్యూ గినియా దేశం ఎంట్రీగా ఎంపికైందని చెప్పడానికి గర్వంగా ఉంది. భారతదేశం నుంచి నిర్మాతలలో ఒకరిగా..రెండు దేశాల సహ-నిర్మాణంలో భాగం కావడం నీలం ప్రొడక్షన్స్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఈ ప్రయాణానికి మద్దతుగా, అలాగే ఈ కథను ప్రపంచ వేదికకు తీసుకెళ్లడంలో కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవమిది. ఈ సినిమా ద్వారా మరిన్ని ప్రశంసలు పొందడం రెండు దేశాలకు గర్వకారణం. ఈ ఘనత సాధించిన పాపా బుకా చిత్ర బృందానికి శుభాకాంక్షలు' అంటూ పోస్ట్ చేశారు.

# ఇక్కడ గింగిరాలు తిరిగే అతడి 'క్యారమ్' బంతి ఆగింది..!

**టీమ్ఇండియాలో హర్భజన్ సింగ్ దూస్రా బంతికి ప్రసిద్ధి. అతడు ఆఫ్ స్పిన్నర్. భజ్జీ వారసుడిగా భారత క్రికెట్‌లో ఉన్నతస్థానానికి ఎదిగిన మరో 'ఆఫ్ స్పిన్నర్' రవిచంద్రన్ అశ్విన్. 'క్యారమ్' బాల్‌తో ప్రత్యర్థిని కంగారుపెట్టేసిన ఇలాంటి సూపర్ బౌలర్ సంచలన నిర్ణయంతో ఫ్యాన్స్‌ను షాక్‌కు గురిచేశాడు. ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడనేది ఇప్పుడు చర్చకు దారితీసింది.**




రవిచంద్రన్ అశ్విన్ వయసు 38 ఏళ్లు. ఎక్కువగా గాయపడే క్రికెటరూ కాదు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడంటే కుర్రాళ్ల నుంచి విపరీతమైన పోటీ ఉందని అనుకోవచ్చు. కానీ, లీగ్ క్రికెట్‌లో అదేమంత పెద్ద సమస్య కాదు. వయసు మీద పడినా ఆడుతోన్న ఆటగాళ్లూ ఉన్నారు. తాజాగా ఇమ్రాన్ తాహిర్‌నే తీసుకుంటే 46 ఏళ్ల వయసులోనూ కుర్రాడిలా వికెట్లు తీస్తూ సత్తా చాటాడు. కానీ, అశ్విన్ మాత్రం ఐపీఎల్‌కూ వీడ్కోలు పలికేయడం మాత్రం ఆశ్చర్యానికి గురిచేసే అంశమే. దీనివెనక ఫ్రాంచైజీల నుంచి సరైన భరోసా రాకపోవడమే కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్‌కు ముందు మినీ వేలం జరగనుంది. ప్రస్తుతం తన జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న అతడిని వదులుకొనేందుకు ఫ్రాంచైజీ సిద్ధమైందనే వార్తలు వచ్చాయి. మరోవైపు రాజస్థాన్‌కే తిరిగి వెళ్దామని అనుకున్నా.. అక్కడినుంచి కూడా తీసుకుంటామనే హామీ రాలేదు. ఇక ఇతర టీమ్‌లు కూడా అశ్విన్‌ను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఐపీఎల్‌కి గుడ్‌బై చెప్పేయడమే మేలన్న ఉద్దేశంతో అశ్విన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనిపిస్తోంది. గత ఐపీఎల్ సీజన్‌లోనూ అన్ని మ్యాచుల్లో ఆడే అవకాశం రాలేదు. తన 'అంతర్జాతీయ' రిటైర్‌మెంట్‌ను సడన్‌గా ఎలా తీసుకున్నాడో.. ఇప్పుడు 'ఐపీఎల్'కూ అదేవిధంగా అనూహ్యరీతిలో వీడ్కోలు పలకడం గమనార్హం.

**అతడి స్పెషాలిటీ అదే..**

ఆధునిక భారత క్రికెట్‌కు ఒక్కోతరంలో ఆఫ్ స్పిన్ బాధ్యతలను మోసేందుకు ఒక్కొక్కరు సిద్ధమంటూ ముందడుగు వేశారు. టాప్ ఆఫ్ స్పిన్నర్లను వేళ్లపై లెక్కపెట్టొచ్చు. హర్భజన్ సింగ్, రవిచంద్రన్ అశ్విన్, వాషింగ్టన్ సుందర్.. తొలి ఇద్దరు ప్లేయర్లు క్రికెట్ అభిమానులకు బాగా సుపరిచితులే. ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించారు. భజ్జీ బాటలో ఆఫ్‌స్పిన్నర్‌గా సేవలు అందించిన అశ్విన్ తనకంటూ ప్రత్యేక శైలిని రూపొందించుకోవడం గమనార్హం. ఆఫ్‌స్పిన్‌లో వైవిధ్యం చూపించాడు. క్యారమ్, ఫ్లైటెడ్ డెలివరీ, దూస్రాలు, గూగ్లీలతో అదరగొట్టేవాడు. మరీ ముఖ్యంగా ఎలా తిరుగుతుందో అంచనా వేయడం కష్టమైన 'క్యారమ్ బాల్'తో బోల్తా కొట్టించేవాడు. వీధి క్రికెట్‌లో నేర్చుకున్న టెక్నిక్‌ను అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించడం విశేషం. ఇటు బ్యాటింగ్‌లోనూ తన సత్తా చాటాడు. ఇప్పటికీ అతడు ఆడుతోన్న తమిళనాడుకు ఒకప్పుడు ఓపెనర్‌గానూ బరిలోకి దిగాడు. ఆస్ట్రేలియాతో 'టెస్టు' మ్యాచ్ నుంచి గట్టెక్కించిన పోరాటాన్ని ఎవరూ మరిచిపోలేరు. వందకు పైగా టెస్టులు, వన్డేలు ఆడిన అశ్విన్ ఖాతాలో ఆరు సెంచరీలూ ఉన్నాయి.

**ఆ లీగ్‌ల్లో ఆడొచ్చా?**

రవిచంద్రన్ అశ్విన్ ఆటను ఇక్కడి ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచుల్లో చూడలేం. కానీ, విదేశీ లీగుల్లో అశ్విన్ ఆడేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కరేబియన్ లీగ్, ఎస్‌ఏ20 లీగ్, బిగ్‌బాష్ లీగ్, హండ్రెడ్ లీగ్.. ఇలా టాప్ ఫ్రాంచైజీ క్రికెట్ మ్యాచులు జరుగుతున్నాయి. అయితే, అక్కడా బరిలోకి దిగాలంటే మాత్రం బీసీసీఐ నిబంధనలను తూ.చ. పాటించాల్సిందే. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌కూ అశ్విన్ వీడ్కోలు పలికినా సరే.. మరొక నిర్ణయం తీసుకుంటేనే విదేశీ లీగుల్లో ఆడేందుకు అవకాశం ఉంది. అలా జరగాలంటే ఫస్ట్‌క్లాస్, లిస్ట్ ఏ క్రికెట్ నుంచీ బయటకు వచ్చేయాలి. మరి అశ్విన్ ప్రస్తుతం తమిళనాడు ప్రీమియర్ లీగ్ వంటి దేశీయ క్రికెట్‌లోనూ ఆడుతున్నాడు. అక్కడా వీడ్కోలు పలుకుతాడో? లేదో? చూడాలి.

**సీఎస్‌కే టు సీఎస్‌కే**

చెన్నై సూపర్ కింగ్స్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ఆరంభించిన అశ్విన్.. ఇప్పుడు ముగింపు కూడా సీఎస్‌కేతోనే కావడం విశేషం. మధ్యలో వేర్వేరు ఫ్రాంచైజీలకు వెళ్లినా గత ఎడిషన్‌కు ముందు జరిగిన మెగా వేలంలో రూ.9.75 కోట్లకు సీఎస్‌కే తీసుకుంది. ఇప్పటివరకు 220 ఐపీఎల్ మ్యాచుల్లో 187 వికెట్లు తీసిన అశ్విన్ 833 పరుగులు చేశాడు. 2010, 2011 ఐపీఎల్ టైటిళ్లను గెలిచిన సీఎస్‌కే జట్టులో సభ్యుడు. రైజింగ్ పుణె సూపర్‌జెయింట్, పంజాబ్ కింగ్స్, దిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఇటీవల సీఎస్‌కేకు సంబంధించిన అంతర్గత విషయాలపై తన యూట్యూబ్ ఛానల్ చర్చా వేదికల్లో అశ్విన్ చేసిన వ్యాఖ్యలూ దుమారమే లేపాయి. ఓ రకంగా అతడి కెరీర్ త్వరగా ముగియడానికి ఇది కూడా ఓ కారణమనే వాదనా ఉంది.





## వచ్చే ఏడాది భారత్‌లో వరల్డ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు 17 ఏళ్ల తర్వాత భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. 2026 ఆగస్టులో న్యూఢిల్లీ వేదికగా ఈ టోర్నీ జరుగుతుంది. మన దేశంలో చివరిసారిగా 2009లో వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. పారిస్‌లో జరిగిన 2025 టోర్నీ ముగింపు సందర్భంగా వచ్చే ఏడాది వేదిక వివరాలను ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది.
ఈ కార్యక్రమంలో బీడబ్ల్యూఎఫ్ అధ్యక్షురాలు ఖున్‌యింగ్ పటామా, భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి లోపాలు లేకుండా వంద శాతం అత్యుత్తమ స్థాయిలో ఈ మెగా టోర్నీని తమ దేశంలో నిర్వహిస్తామని మిశ్రా వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం ప్రపంచ బ్యాడ్మింటన్‌లో నిలకడగా విజయాలు సాధిస్తున్న జట్లలో భారత్ కూడా ఒకటి. వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇప్పటివరకు 15 పతకాలు గెలుచుకుంది. 1983లో ప్రకాశ్ పడుకోన్ పురుషుల సింగిల్స్‌లో కాంస్యంతో తొలి పతకం అందించగా... 2011 నుంచి ప్రతీ ఏటా కచ్చితంగా మన ఆటగాళ్లు ఏదైనా ఒక పతకం గెలుస్తూ వచ్చారు. అత్యధికంగా పీవీ సింధు ఒక స్వర్ణం సహా మొత్తం ఐదు పతకాలు సాధించింది.



## పైరేట్స్‌కు యోధాస్ షాక్

ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో యూపీ యోధాస్ జోరు పెంచుతోంది. ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ 34-31తో మూడుసార్లు ఛాంపియన్ అయిన పట్నా పైరేట్స్‌ను కంగుతినిపించింది. ఆట ఆరంభంలో పైరేట్స్ పైచేయి కనబరిచింది. మొదటి పది నిమిషాలైతే చకచకా పాయింట్లు రాబట్టిన పట్నా 7-6తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత యూపీ యోధాస్ ఆటగాళ్లు సమష్టిగా రాణించడంతో పట్నా వెనుకబడింది. రెయిడర్లలో గగన్ గౌడ 7 పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో భవాని రాజ్‌పుత్, శివమ్ చెరో 5 పాయింట్లు చేశారు.

డిఫెండర్లలో కెప్టెన్ సుమిత్, అశు సింగ్ తలా 5 పాయింట్లు సాధించారు. పట్నా పైరేట్స్ జట్టులో రెయిడర్లు అయాన్ (9) మణిందర్ సింగ్ (7) రాణించారు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో మాజీ ఛాంపియన్ పుణేరి పల్టన్ 41-19తో గుజరాత్ జెయింట్స్‌పై అలవోక విజయం సాధించింది. రెయిడింగ్‌లో ఆదిత్య షిండే (6), పంకజ్ (5), డిఫెండర్లలో అభినేశ్ (6), గౌరవ్ ఖత్రి (4) అద్భుతంగా ఆడారు. ఆల్‌రౌండర్లు అస్లామ్ (5), గుర్దీప్ (4)లు కూడా మెరుగ్గా రాణించడంతో పుణేరి జట్టు క్రమం తప్పకుండా పాయింట్లు సాధించింది. గుజరాత్ తరఫున రెయిడర్ రాకేశ్ (6) మాత్రమే చెప్పుకోదగ్గ ప్రదర్శన కనబరిచాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో దబంగ్ ఢిల్లీతో బెంగళూరు బుల్స్, జైపూర్ పింక్ పాంథర్స్‌తో పట్నా పైరేట్స్ తలపడతాయి.

## సంజు శాంసన్‌ను టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలి: టీమ్ఇండియా మాజీ క్రికెటర్

**మరికొన్ని రోజుల్లోనే యూఏఈ వేదికగా ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో సంజు శాంసన్ బ్యాటింగ్ స్థానం గురించి టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు. అతన్ని టాప్ ఆర్డర్‌లోనే ఆడించాలని సూచించాడు. అయితే ప్రస్తుతం జట్టులో సంజుశాంసన్ బ్యాటింగ్ స్థానం మీద అనిశ్చితి నెలకొని ఉంది. అతడు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడు అనే విషయంపై ఇప్పటికైతే స్పష్టత లేదు.**




'సంజు శాంసన్‌కే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎందుకంటే అతడు గత సిరీస్ ఆడాడు. అలాగే అతడు చివరి 12 మ్యాచుల్లో ఏకంగా మూడు సెంచరీలు సాధించాడు. అయితే అతడికి టాప్ఆర్డర్‌లోనే స్థానం కల్పించాలి. ఎందుకంటే.. నాలుగు నుంచి ఏడు స్థానాల మధ్య అతడు 98 మ్యాచులు ఆడితే యావరేజ్ 20, స్ట్రైక్‌రేట్ 126 మాత్రమే ఉంది. ఆయా స్థానాల్లో యావరేజ్ కానీ, స్ట్రైక్‌రేట్ కానీ అద్భుతంగా లేవు. అందుకే అతన్ని ఒకటి, రెండు, మూడు స్థానాల్లోనే ఆడించాలి. అకస్మాత్తుగా అతడి బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేస్తే.. అతడి ప్రదర్శన పడిపోతుంది' అని ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. అలాగే అతడు జితేశ్ శర్మ గురించి కూడా మాట్లాడాడు.

'జితేశ్ శర్మ కచ్చితంగా తుది జట్టులో ఉండాలని నేను కోరుకుంటున్నా. అతడి స్ట్రైక్ రేట్ 166, యావరేజ్ 28గా ఉంది. స్ట్రైక్‌రేట్ 150 పైన ఉన్న బ్యాటర్లలో అతడిదే మొదటి స్థానం. అతడి గణాంకాలు అందరికన్నా ఘనంగా ఉన్నాయి. అతడు ఆసియా కప్‌లోనూ సత్తా చాటుతాడని ఆశిస్తున్నా' అని ఆకాశ్‌చోప్రా పేర్కొన్నాడు.

సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. మొదటి మ్యాచ్ అఫ్గానిస్థాన్, హాంకాంగ్‌ల మధ్య జరగనుంది. టీమ్ఇండియా తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది.

# చరిత్ర సృష్టించిన జొకోవిచ్

**టెన్నిస్ చరిత్రలోనే అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా అవతరించేందుకు ప్రయత్నిస్తున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో అడుగు ముందుకు వేశాడు. టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ఈ మాజీ ఛాంపియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గత ఏడాది మూడో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టిన ఏడో సీడ్ ఈసారి మాత్రం సాధికారిక ఆటతో టైటిల్‌పై గురి పెట్టాడు.**



గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఓవరాల్‌గా 64వ సారి క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించిన జొకోవిచ్... యూఎస్ ఓపెన్‌లో 14వ సారి ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలో 38 ఏళ్ల జొకోవిచ్ ఒకే ఏడాది అన్ని గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ (ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) కనీసం క్వార్టర్ ఫైనల్ చేరిన అతి పెద్ద వయస్కుడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు.

**న్యూయార్క్:** కెరీర్‌లో 19వ సారి యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఆడుతున్న సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఒక్కో అడ్డంకిని అధిగమిస్తూ దూసుకెళ్తున్నాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 6-2తో జాన్ లెనార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. 1 గంట 49 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్‌కు ఏ దశలోనూ ఇబ్బంది ఎదురుకాలేదు. 12 ఏస్‌లతో అదరగొట్టిన జొకోవిచ్ ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయకపోవడం విశేషం.

నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చిన అతను 15 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను ఒకసారి చేజార్చుకున్న మాజీ ఛాంపియన్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 33 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ కేవలం 20 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు జాన్ లెనార్డ్ ఆరు డబుల్ ఫాల్ట్‌లు, 32 అనవసర తప్పిదాలతో డీలా పడ్డాడు.

'ఈ టోర్నీలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఇదే నా అత్యుత్తమ ప్రదర్శన. ఇదే జోరును మున్ముందు కొనసాగిస్తానని నమ్మకంతో ఉన్నా' అని నాలుగు సార్లు యూఎస్ ఓపెన్ టైటిల్ సాధించి, ఆరుసార్లు రన్నరప్‌గా నిలిచిన జొకోవిచ్ వ్యాఖ్యానించాడు.
ఇక క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్, గత ఏడాది రన్నరప్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో జొకోవిచ్ తలపడతాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో టొమాస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్)పై నెగ్గాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఎనిమిదో సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.
ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అల్‌కరాజ్ 7-6 (7/3), 6-3, 6-4తో ఆర్థర్ రిండర్‌నీచ్ (ఫ్రాన్స్)పై, డిమినార్ 6-3, 6-2, 6-1తో లియాండ్రో రీడి (స్విట్జర్లాండ్)పై నెగ్గారు.

**రిబాకినాకు షాక్**

మహిళల సింగిల్స్ విభాగంలో తొమ్మిదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్) ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. ప్రపంచ 60వ ర్యాంకర్, 2023 వింబుల్డన్ ఛాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-4, 5-7, 6-2తో 2022 వింబుల్డన్ విజేత, ప్రపంచ 10వ ర్యాంకర్ రిబాకినాను ఓడించి ఈ టోర్నీలో రెండోసారి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. 1 గంట 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో వొండ్రుసోవా 13 ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

మరోవైపు ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ ఛాంపియన్ సబలెంకా (బెలారస్), బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6-1, 6-4తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్)పై, క్రెజికోవా 1-6, 7-6 (15/13), 6-3తో టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా)పై గెలుపొందారు. టౌన్‌సెండ్‌తో జరిగిన మ్యాచ్‌లో క్రెజికోవా రెండో సెట్‌లో ఏకంగా 8 మ్యాచ్ పాయింట్లను కాచుకొని గట్టెక్కడం విశేషం. క్వార్టర్ ఫైనల్స్‌లో వొండ్రుసోవాతో సబలెంకా; క్రెజికోవాతో జెస్సికా పెగూలా (అమెరికా) తలపడతారు.

## ఆ కంపెనీలు టీమ్ఇండియా స్పాన్సర్ షిప్ కోసం దరఖాస్తు చేయొద్దు: బీసీసీఐ

**ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025 పార్లమెంటులో ఇటీవలే ఆమోదం పొందింది. దీంతో టీమ్ఇండియా స్పాన్సర్‌గా డ్రీమ్ 11 తప్పుకుంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నూతన స్పాన్సర్‌ను వెతుక్కునే పనిలో ఉంది. ఇందులో భాగంగానే మంగళవారం టీమ్ఇండియా స్పాన్సర్ షిప్ కోసం బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించింది. దీని కోసం పలు మార్గదర్శకాలనూ జారీ చేస్తూ, ఆసక్తి ఉన్న కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది.**



అలాగే ఆయా కంపెనీలు పలు నియమ, నిబంధనలకు లోబడి ఉండాలని షరతులు విధించింది. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించొద్దని పేర్కొంది. స్పాన్సర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గాంబ్లింగ్‌తో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎలాంటి సంబంధం కలిగి ఉండకూడదని తెలిపింది. ఆయా కంపెనీలు కేవలం భారత్‌లోనే కాదు.. ప్రపంచంలో కూడా ఇలాంటి సేవలు అందించకూడదని తేల్చింది. అలాగే ఆయా కంపెనీలకు బెట్టింగ్, బిడ్డింగ్ సంస్థల్లో పెట్టుబడులు కూడా ఉండకూడదని స్పష్టం చేసింది. కేవలం గేమింగే కాకుండా, క్రిప్టో ట్రేడింగ్, క్రిప్టో ఎక్స్ఛేంజ్, క్రిప్టో టోకెన్స్‌కు సంబంధించిన వ్యాపార కార్యకలాపాల్లో కూడా ఆయా కంపెనీలు పాలు పంచుకోకూడదని బీసీసీఐ లక్ష్మణ రేఖ గీసింది. వీటితో పాటు నిషేధిత బ్రాండ్లకు సంబంధించిన కంపెనీలు కూడా బిడ్డింగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధించింది. టీమ్ఇండియా జెర్సీ స్పాన్సర్ షిప్‌నకు సంబంధించిన ఈ బిడ్డింగ్‌లో పాల్గొనాలనుకునే కంపెనీల వార్షిక టర్నోవర్ కనిష్ఠంగా రూ.300 కోట్ల రూపాయలైనా ఉండాలని బీసీసీఐ స్పష్టం చేసింది. అలాగే ఆయా కంపెనీలు తమ దరఖాస్తులను సమర్పించడానికి సెప్టెంబర్ 16 వరకు అవకాశాన్ని కల్పించింది. యూఏఈ వేదికగా ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచే ప్రారంభం కానుంది.